2)

# భోగిపిడకలు

పెరటిగోడమీది ఎండుపిడకల్ని గోకి పిల్లలు దండ గుచ్చుతున్నారు. ఒక్కొక్క పిడకనీ గోకుతూఉంటే గోడ యొక్క వికృతరూపం బైటబడుతున్నాది. అసలే పాతగోడ. దానికితోడు పిడకలతోపాటు పెల్లలూడొస్తున్నాయి. గోడని చూస్తూఉంటే నాబతుకు నాముందు నించున్నట్టనిపిస్తున్నాది.

'ఎన్నర్రా' అని అడిగాను. 'ఇవి రెండువందల ఇరవై ఒకటి. అన్నీకలిపి మూడువందలచిల్లర' అని మా సందడిగా చెప్పేరు. మూడువందల పిడకలని మహదానందం పొందేను. నాఉద్దేశం వాళ్ళ కేంతెలుసు?

బతికి చెడ్డ సంసారం; నలుగురు సంతానం; నల్భై రూపాయల ఉద్యోగం; కరువుకాలం;ఇది నాస్థితి. రేపటినుంచి సంక్రాంతి పర్వదినాలు. పిల్లలకి బట్టలు కుట్టించలేదు. ఇంటికి వెల్ల వేయించలేదు. నాలుగేళ్ళయి నెట్టుకొస్తున్నాను. షష్ఠి పూర్తి కోరుతున్న యిల్లు సున్నం వేయించని మూలాన చీకటి కొంపై మనదేశంలా మూలుగుతున్నాది.

ఈ కరువు కాలంలోకూడా పొదుపుగా, హాయిగా, బతికిందికి, మహారాజశ్రీ గవర్నమెంటువారు ప్రతిపత్రికలో ఇచ్చే సలహాలతో కలుపుకొని, అనేకమార్గాలు ఆలోచించి ఆచరణలో పెడుతున్నా. దాగరంత పెరడులోనే పాదులు

పెట్టి అధిక ఆహారోత్పత్తి చేస్తున్నాను; కూరల ఖర్చు తగ్గించి బతుకుతున్నాది.

నెల్లాళ్ళకు ముందే నా పిల్లలు ఏ వీధిలో, ఏ ఆవు వెనక చూసినా పిల్లలయి పేడ తెచ్చి పిడకలు పెడు తున్నప్పుడే నాకు ఏడుపొచ్చింది. విలువైన చక్కటి ఎరువుని కాల్చివేయాలికదా అని. కొంతపేడ పాదులదగ్గర వేయండర్రా అంటే, ససేమిరా, పక్కింటివాళ్ళ పిల్లల్ని హెచ్చు పిడకలుపెట్టి ఓడించాలి అని, ఒక పిడక్కి సరిపోయినంత పేడయినా పాదులకి వెయ్యలేదు. ఒట్టిరోజుల్లో నా పెళ్ళాం పొయ్యిలుక్కొండికి కొంచెంపేడపిసరు తెమ్మంటే ఒకళ్ళూ తెచ్చినపాపాన పోలేదు.

అసలు మనరైతులకే సత్తువైన ఎరువుని తగలెట్టేకంటె అంటే-డబ్బున్న మారాజులకి కర్రబొగ్గూ, సరుగుడు కర్ర కాని, మాలాంటి పేదవాళ్ళకి పిడకలుకాక మరేమిటి అని అడుగుతారు. అలాంటప్పుడు లోకజ్ఞానంలేని నా పిల్లలకి వ్యవసాయ రహస్యంగాని, మన ఆర్థిక దుస్థితిగాని ఏం బోధ పడుతుంది?

భోగినాడుకూడా ఖర్చుతగ్గిస్తూ చక్కగా పండుగచేసు కొందికి నా కోమార్గం తోచి కుర్రాళ్ళనిపిలిచి 'రేపుపండుగ డబ్బులు కావాలా?' అని అడిగేను.

'మ రివ్వ వేవిటి?'

'అదికాదు. మామూలు కన్నా హెచ్చుకావాలా?'

పరమానందంతో పిల్లలు 'ఊ' అన్నారు.

'అయితే ఓపని చేయండి. రేపు ఈపిడకల్ని మంటలో వేయకండి' అని నామరతు చెప్పాను.

'అదేమిటి భోగినాడు పిడకల్ని కాక మరేమిటి మంట వేసుకుంటారు?' అని ముక్తకంఠంతో ప్రశ్నించేరు.

'వినండి, ఈపిడకల్ని మీఅమ్మ నీళ్ళపొయ్యిలో వేసి, రేపు మీకు తలంటుతుంది. మనకి రేపు నీళ్ళకి కాలే పుల్ల కర్రలు మిగులుతాయి. అంటే పదణాలన్నమాట. ఆ పద ణాలు మీ నలుగురికీ ఇచ్చేస్తానన్నా.

పిల్లలకి సలహా నచ్చలేదు. వాళ్ళకీ తెలుసు. నేను పద ణాలిచ్చినా అడబ్బు దాస్తానని తీసుకొని నాపెళ్ళాం ఇంటి ఖర్చుపెడుతుంది. ఇప్పటికి పిల్లలందరికీ కలిపి నాపెళ్ళాం ఇరవైరూపాయలు బాకీ. ఈఅప్పు ఈజన్మలో తీరదని వాళ్ళకి తెలిసిన సూర్యకాంతిలాంటి పరమసత్యం. అందుకే పద ణాలుకాదు, పదిరూపాయలిస్తానన్నా పిడకలు మంటపెట్టక తప్పదని పట్టుపట్టేరు.

నా శాయశక్తులా నచ్చచెప్పేను. భోగిమంటే కావ లసొస్తే పక్కవీధి శెట్టిగారింటిముందు మంటదగ్గరికి వెళ్ళ మన్నా. ఈ కరువురోజుల్లోకూడా పేకేజీపెట్లు తగలెట్టి

భోగిపండుగ చేసుకొంటారు. చక్కా ఆనందించవచ్చు అని బోధ సల్పేను. ఊహూ. నా తీర్మానానికి ఏకగ్రీవంగా అసమ్మతి తెలియబర్చేరు. ఎవరింటిముందు వాళ్లు మంట వేసుకోవాలట! భోగిమంట సంక్రాంతి పురుషుడికి హారతి కాదుకదా! మంట వెయ్యకపోతే మన పుట్టెం మునిగి పోతుందని చెప్పేను. వినలేదు.

చిన్నప్పట్నుంచీ, ఆర్థిక బాధ్యత పిల్లల బుర్ర కెక్కించాలని నా సిద్ధాంతం. అందుకే ఈ మార్గం నచ్చ చెప్పబోయేను. లాభంలేకపోయింది. మంటవేస్తే పిల్లగుండెకి ఏవి ఆనందమో మర్చిపోయి ముప్ఫయి వేళ్ళయింది!

'పదణాల ఖర్చు తప్పకపోతే పది పరకలేనా మిగులు తాయని సంతోషిస్తూ, పోనీ మంట వేసుకుంటే వేసుకున్నారు గానీ, కచ్చికలు జాగ్రత చేయండి. పందుంపుల్లల ఖర్చైనా తగ్గుతుంది' అన్నా౭.